తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
2 ఆగస్టు 2026
పేజీలు : 08
Follow :



# లష్కర్... బోనమెత్తుతోంది



- నేడు అమ్మవారికి తొలి బోనం సమర్పణ
- తెలంగాణలోని నాలుగు కోట్ల మంది భక్తుల పండుగ
- 20 లక్షల మందికి పైగా భక్తుల రాక అంచనా
- ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రత
- అశ్లీల ప్రదర్శనలు, డీజేలకు నో.. పోలీసుల హెచ్చరిక
- ట్రాఫిక్ ఆంక్షలు.. ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు

## ఉజ్జయిని మహంకాళి ఆలయానికి భక్తుల వెల్లువ





సికింద్రాబాద్, ఆగస్టు 1 (జనంసాక్షి):

తెలంగాణ ప్రజల అత్యంత వైభవంగా జరుపుకునే ఆషాఢ బోనాల మహోత్సవాలకు నేడు శిఖర ఘట్టం. సికింద్రాబాద్ ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో లష్కర్ బోనాల సందడి తారాస్థాయికి చేరనుంది. తెల్లవారుజాము నుంచే వేలాది మంది మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలివస్తున్నారు.ఆలయంలో ప్రత్యేక పూజలు, మహామంగళహారతులు, ఘటాల ఊరేగింపులు, రంగం కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య జరుగనున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుండటంతో సికింద్రాబాద్ మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. వేలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తూ ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు. డీజేలు, అశ్లీల నృత్యాలు, మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడంపై పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. భక్తులు అధికారుల సూచనలు పాటించి ప్రశాంతంగా బోనాల వేడుకలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

# తహశీల్దార్ తీరుపై మంత్రి ఫైర్

- ప్లాట్ల సమాచారం లీక్ ఆరోపణలు
- విచారణకు ఆదేశాలు.. కఠిన చర్యల హెచ్చరిక
- అధికారులు దళారుల కోసం కాదు.. ప్రజల కోసం పని చేయాలి
- రైతుల హక్కులకు భంగం కలిగిస్తే ఉపేక్షించబోమన్న పొంగులేటి

**రైతుల ఫిర్యాదులతో షాబాద్‌లో కలకలం**

షాబాద్ మండల తహశీల్దార్ పనితీరుపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కేటాయించే ప్లాట్ల వివరాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చేరుతున్నాయన్న ఫిర్యాదులపై స్పందించిన మంత్రి వెంటనే విచారణకు ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి, అధికార దుర్వినియోగం ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు.

రైతుల భూములు, ప్లాట్ల కేటాయింపుల్లో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించిన మంత్రి, ఫిర్యాదుల్లో వాస్తవాలు తేలితే శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా రెవెన్యూ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.



లోపలి పేజీలో

# మొయినాబాద్‌కు రూ.4.25 కోట్ల అభివృద్ధి వరం

26 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల పనులకు ఆమోదం

- నూతన కౌన్సిల్ హాల్ ప్రారంభం
- పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్
- సాధారణ కౌన్సిల్ సమావేశంలో కీలక తీర్మానాలు

2



# అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

- విద్యుత్ సమస్యలపై సభ్యుల ఆగ్రహం.. ఏఈ తీరుపై మండిపాటు
- పాఠశాలల నిర్వహణ అధ్వాన్నమంటూ ఎంఈఓకు ప్రశ్నల వర్షం
- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అసమానతలపై అభ్యంతరాలు
- ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశంలో వాడీవేడీ చర్చ

లోపలి పేజీలో

# ఆపరేషన్ ముస్కాన్ లక్ష్యం నెరవేరేనా...!!

**జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న బాల కార్మికులు**

**జనవరి జూలై నెలలోనే ఆపరేషన్ ముస్కాన్ ఆపరేషన్ స్మైల్ కారణంగా**

**భారీగా పట్టుబడుతున్న చిన్నారులు**

**పట్టుబడిన చిన్నారులకు సంరక్షణ ఎంతవరకు ఉన్నట్లు..?**

**ఎన్నో ఏళ్లుగా భర్తీ కానీ బాల రక్షణ భవన్ కోఆర్డినేటర్ పోస్ట్**



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు1 (జనం సాక్షి ):** జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో సాగిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ స్మైల్ లక్ష్యం నెరవేరిందా.. అంటే నెరవేరలేదని చెప్పొచ్చు. ప్రతిసారి ఈ ఆపరేషన్ జరిగినప్పుడు వందల సంఖ్యలో బాల కార్మికులు ఇతర చిన్నారులు పట్టుబడుతున్నారు. ఆపరేషన్ ముస్కాన్ ఆపరేషన్ స్మైల్ సక్సెస్ అయితే మరి బాల కార్మికులు ఎక్కడి నుంచి పుట్టుకొస్తున్నారన్నది సందేహమే.. కానీ ఆపరేషన్లలో పట్టుబడిన చిన్నారులకు సంరక్షణ ఏ మేరకు అందుతుంది అన్నది అధికారులు తేల్చలేని పరిస్థితిలో ఉన్నారు. ఇక మొదటిసారి పట్టుబడిన బాల కార్మికులు రెండోసారి కూడా పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే... వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ ఆపరేషన్ స్మైల్ జనవరి జూలై నెలలో జరుగుతుంది. జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో ఈ ఆపరేషన్ లో పాల్గొంటాయి. వికారాబాద్ ఎస్పీ ఆపరేషన్ ముస్కాన్ ఆపరేషన్ స్మైల్ లో పట్టుబడిన చిన్నారుల సంఖ్య వారి సంరక్షణ విషయమై నివేదిక మీడియాకు తెలియజేస్తారు. కానీ వాస్తవంగా చూస్తే ఆపరేషన్ ముస్కాన్ ఆపరేషన్ స్మైల్ లో బాల కార్మికులు బాల్య వివాహాలు భిక్షాటన బడిమానిన పిల్లలు అక్రమ రవాణా జరిగే పిల్లలు పట్టుబడుతుంటారు. వీరి సంరక్షణ బాధ్యత పూర్తిగా అధికారులపై ఉంటుంది. ఆపరేషన్ ముస్కాన్ ఆపరేషన్ స్మైల్ లలో పట్టుబడిన చిన్నారులు స్వరాష్టానికి చెందిన వారైతే వారి తల్లిదండ్రుల అప్పగించడం లేదా వారికి సంరక్షణ కల్పించి ప్రయోజకులను చేసే విధంగా కార్యచరణ ఉంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పట్టుబడిన చిన్నారులకైతే ఆ రాష్ట్రాల అధికారుల నుంచి సంప్రదించి అధికారిక సర్టిఫికెట్ తీసుకొని వారి తల్లిదండ్రులకు లేదా అక్కడ అధికారుల సంరక్షణలో చిన్నారులను ఉంచవలసిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ ఇవేమీ సరిగా జరిగినట్లు కనిపించిన దాఖలాలు లేవు. ఇతర రాష్ట్రాల స్వరాష్ట్రంలో నుంచి వచ్చి పట్టుబడిన చిన్నారులను చిరునామా ప్రకారం వారి తల్లిదండ్రులకు అప్పగించి వదిలేస్తున్నట్లు తెలుస్తుంది. ఆర్థిక సమస్య లేక ఇంకేమైనా కారణమున్న చిన్నారుల తల్లిదండ్రులు మళ్లీ యధాప్రకారం పిల్లలను పనిలోకి పంపించడం ఇతర చిన్నారులు యధా ప్రకారం ఉండడం కారణంగా బాల కార్మికులు ఇతర చిన్నారుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఆపరేషన్ స్మైల్ ఆపరేషన్ ముస్కాన్ జరిగినప్పుడు చిన్నారులు పట్టుబడితే సంబంధిత యజమానిపై అధికారులు కేసులు నమోదు చేస్తారు. కానీ కొన్ని ఏళ్లు గడుస్తున్న నమోదైన కేసులు ముందుకు సాగినట్లు లేదు. పూర్తిస్థాయిలో కేసు వేస్తే సంబంధించిన సి డబ్ల్యూ సి వారికి నోటీసు రావాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు జిల్లాలో ఇలాంటి నోటీసు వచ్చిన దాఖలాలు లేవు. ప్రమాదకర పరిశ్రమల్లో పనిచేసిన వారిపై చార్జిషీట్ వేయవలసి బాధ్యత అధికారులపై ఉంటుంది.

**ఎన్నో ఏళ్లుగా భర్తీ కానీ బాల రక్షణ భవన్ అధికారి పోస్ట్**

వికారాబాద్ బాల రక్షణ భవన్ అధికారి పోస్ట్ ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉంది. పూర్తిస్థాయి అధికారి లేని కారణంగా పనుల్లో జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం ఈ పోస్టుకు మూడు బాధ్యతలు కలిగిన అధికారి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. సిడిపిఓ. బి ఆర్ బి సి. డి డబ్ల్యూ ఓ గా ఒకే అధికారి బాధ్యతలను చూస్తున్నారు. పూర్తిస్థాయిలో అధికారులేని కారణంగా బాల రక్షణ భవన్ లక్ష్యం నెరవేరడం లేదు. ముస్కాన్ స్మైల్ ఆపరేషన్ సందర్భంగా పట్టుబడిన చిన్నారుల సంరక్షణ కోసం ప్రభుత్వపరంగా వివిధ రకాల లో ఆర్థిక సాయం అందవలసి ఉంటుంది. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్ గా ఉంటారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీ సమావేశం జరగవలసి ఉంటుంది. కానీ ఈ మధ్యకాలంలో సమావేశం జరిగినట్లు లేదు. అధికారులు ఎప్పటికైనా పూర్తిస్థాయిలో దృష్టి సారించి ముస్కాన్ స్మైల్ ఆపరేషన్లలో పట్టుబడిన చిన్నారులను ప్రయోజకులను చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.



## కొందుర్గు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో దారుణం

**విద్యార్థిని మందలించడాని మండల విద్యాధికారికి ఫిర్యాదు**

**జనంసాక్షి కొందుర్గు :** బడికి వెళ్లిన విద్యార్థిపై ఒక ఉపాధ్యాయుడు కిరాతకంగా ప్రవర్తించిన ఘటన కొందుర్గు మండలంలో వెలుగుచూసింది. పాఠశాలల్లో శారీరక శిక్షలు పూర్తిగా నిషేధమని చట్టాలు చెబుతున్నా, సదరు ఉపాధ్యాయుడు విద్యార్థిని కొట్టిన ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.బాధితుడి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో మహమ్మద్ అర్మాన్ అనే బాలుడు 4వ తరగతి చదువుతున్నాడు. శనివారం (01-08-2026) రోజున విరామ సమయంలో బాలుడు బాత్రూమ్‌కు వెళ్లి, నీళ్లతో కడుక్కుని తిరిగి వస్తుండగా ఒక చిన్న విషయానికి సంబంధించి స్కూల్ టీచర్ వెంకటేష్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. విద్యార్థి అని కూడా చూడకుండా కర్రతో వస్తువుతో దారుణంగా కొట్టాడాని తెలిపారు.సాయంత్రం బాలుడు పాఠశాల నుండి ఇంటికి తిరిగి వచ్చేసరికి వీపు కిందిబాగం ముడ్డిపై వాతలు కనిపించాయి. తీవ్ర భయాందోళనలకు గురైన బాలుడిని తల్లిదండ్రులు ఆరా తీయగా, ఉపాధ్యాయుడు వెంకటేష్ చేసిన దాడి గురించి ఏడుస్తూ వివరించాడు. ఈ అమానుష చర్య వల్ల బాలుడు శారీరక గాయాలకే కాకుండా తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడని మండల విద్యాధికారి కి అధికారిక ఫిర్యాదు చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలల్లో పిల్లలను శారీరకంగా, మానసికంగా వేధించడం చట్టవిరుద్ధమని తెలిసిన ప్రయివేటు స్కూలుకు పంపినందుకు తమ బిడ్డపై ఇంత క్రూరంగా ప్రవర్తించడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై విద్యార్థి తండ్రి కొందుర్గు మండల విద్యాధికారికి శనివారం లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. బాధితుడి గాయాలకు సంబంధించిన ఫోటోలను కూడా ఫిర్యాదుకు జతపరిచారు.ఈ దారుణానికి ఒడిగట్టిన ఉపాధ్యాయుడు వెంకటేష్ తో పాటు సంబంధిత స్కూల్ యాజమాన్యం పై తక్షణమే నిష్పక్షపాత విచారణ జరిపి, కఠిన క్రమశిక్షణా మరియు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలలో పిల్లలకు ఎలాంటి భయం లేని సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేలా యాజమాన్యాన్ని ఆదేశించాలని విద్యాశాఖ అధికారులను వేడుకున్నారు. ఈ ఘటనపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# మున్సిపల్ సమావేశంలో రసాభాస

**నేల పై కూర్చొని కౌన్సిలర్ల నిరసన**

**కుమ్మరి సంఘం భవనానికి నిధులు కేటాయించాలని డిమాండ్**

**ఎజెండా నుంచి తొలగింపు పై ఆగ్రహం**

**కౌన్సిలర్ మధ్య వాదోపవాదాలు**

**సముదాయించిన మున్సిపల్ కమిషనర్**



**రంగారెడ్డి ఆగస్టు 01 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఉద్రిక్తత నెలకుంది. సభ్యుల నిలదీతలు నిరసనలు నేలపై బైఠాయింపులతో అట్టుడికింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు సభ ప్రారంభం కాగానే మున్సిపల్ కమిషనర్ ఎజెండా అంశాలు వివరిస్తుండగా 18 వ వార్డు కౌన్సిలర్ సిద్ధం భానుప్రియ, గూడూరు గిరి ఒక్కసారిగా తమ నిరసన వ్యక్తం చేశారు. 18 వ వార్డులో కుమ్మర సంఘం భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు కేటాయించాలని ఎజెండా అంశాల్లో పొందుపరచాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తెచ్చానన్నారు. ఎజెండాలు అంశాలు పొందుపరిచి తొలగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వార్డుపట్ల ఎందుకు మున్సిపల్ పాలకవర్గం నిరక్ష అని పద్ధతి చేస్తుందని నిలదీశారు అందుకు చైర్మన్ నుంచి స్పష్టమైన సమాధానం రావడంతో వారు నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. తమ వార్డులో భవన నిర్మాణం కోసం 20 లక్షల రూపాయలు కేటాయించాలని పట్టుబట్టారు. అప్పటివరకు నేలపైన కూర్చొని నిరసన వ్యక్తం చేస్తానని భీష్మించారు. కౌన్సిలర్ గూడూరి గిరి తమ వార్డుకు సంబంధించిన ప్రపోజల్‌ను లిస్టు నుంచి తొలగించరంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సమావేశ మందిరంలోనే నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. తమ వార్డుల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంపిన ప్రతిపాదనలను అధికారులు, పాలకవర్గం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో సమావేశంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమావేశం రసాభాసగా మారింది. మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ కౌన్సిలర్ల అభ్యంతరాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించింది. అయితే ఈ ఘటన ఇబ్రహీంపట్నం మున్సిపల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ పాలకవర్గం ఏ పడినప్పటి నుండి మొదటి సర్వసభ్య సమావేశం కావడంతో అందరి దృష్టి అభివృద్ధిపై మళ్లింది. తమ వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తీర్మానం చేయించుకోవడానికి పట్టుబట్టారు. అన్ని ఓటర్లకు సమాన స్థాయిలో నిధుల కేటాయింపులు చేయాలని సభ్యులు సూచించారు. ఈ సమావేశంలో చైర్మన్ సుదర్శన్ రెడ్డి వైస్ చైర్మన్ ముత్యాల శ్యామల భాస్కర్ తదితరులు ఉన్నారు.

## చౌదర్‌పల్లిలో ఓటరు జాబితా సవరణ వంద శాతం పూర్తి

**అధికారులకు,సిబ్బందికి ఘన సన్మానం.. సర్పంచ్ అభినందనలు**



**మహమ్మదాబాద్,ఆగస్టు 01 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చౌదర్‌పల్లి గ్రామ పంచాయతీ మరో మైలురాయిని చేరుకుంది. గ్రామ పరిధిలోని,107,108,పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)కార్యక్రమాన్ని శతశాతం పూర్తి చేసి ఆదర్శంగా నిలిచింది.ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ సుంకిరెడ్డి అనూష సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి,ఓటరు జాబితా సవరణను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కే.ఎం నారాయణ,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ బాలముకుందంలను, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, ప్రజాప్రతి నిధులకు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ,ఓటరు జాబితా ఖచ్చితత్వం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమని, అధికారులు,సిబ్బంది, ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజల సమిష్టి సహకారంతోనే శతశాతం లక్ష్యాన్ని విజయవంతంగా సాధించగలిగామని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఆర్ఐ ఫాహేద్ పాషా,జీపీఓ మాసయ్య,గ్రామ కార్యదర్శి రమాదేవి,మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఈసాబి, కె.తిరుపతి, కె.మహేందర్, ఎల్.కేశవులు, కె.ఆనంద్, బీఎల్‌వోలు,బీఎల్ఏలు బోయిని రాజు, బోయిని ఆంజనేయులు,జె.రమేష్,బిభీమయ్య,బి.కాశీనాథ్,గ్రామ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

### ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

### ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డికి వినతి



**రంగారెడ్డి ఆగస్టు 1 (జనంసాక్షి)**అర్హులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య డిమాండ్ చేశారు. హయత్ నగర్ మండలం సాహెబ్ నగర్ చెందిన పేదలతో కలిసి సీపీఐఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆర్డిఓ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డిఓ శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ పరిధిలోని సర్వే నంబర్ 71కి చెందిన 25 ఎకరాల ప్రభుత్వ భూమిలో అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గత అనేక సంవత్సరాలుగా సీపీఐఎం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో పేదలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించినప్పటికీ, ప్రజల హక్కుల కోసం వెనకడుగు వేయకుండా పోరాటం కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. పేదల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని తీరుతామని హెచ్చరించారు. గతంలో కలెక్టరేట్ వద్ద వేలాది మందితో నిర్వహించిన ధర్నా స్పందనగా, ఇబ్రహీంపట్నం, కందుకూరు ఆర్డీవోలు అర్హుల జాబితాను సేకరించి సర్వే నిర్వహించి వివరాలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు గుర్తు చేశారు. వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు డి. కిషన్, బుగ్గ రాములు, నాయకులు వీరయ్య, గణేష్, సీహెచ్. ఎల్లేష్, కాశయ్య, అంజి నాయక్, పోలే రమేష్, రాధమ్మ, సుమన్ నాయక్, శక్తి మధు, కిరణ్, రేణుక, వెంకటేష్, కురుమయ్య, వజ్రమ్మ, బిక్షపతి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సీహెచ్. వెంకన్న ఉన్నారు.

# అంబేద్కర్ చౌక్ వద్ద గుంతతో ప్రమాద ముప్పు

### భారీ గేట్ ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయం



**తాండూరు ఆగస్టు 1(జనంసాక్షి)** మున్సిపల్ 28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ ఎదురుగా ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్‌ను తొలగించడం వల్ల అక్కడ సిమెంట్ దిబ్బలతో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న వెంటనే కౌన్సిలర్ మల్లేశం మున్సిపల్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తక్షణ చర్యగా ఆ ప్రాంతంలో ఒక భారీ గేట్‌ను ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాన్ని కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నాగారం మల్లేశం మాట్లాడుతూ సిగ్నల్ పాయింట్ తీయడం వల్ల ఏర్పడిన గుంత వల్ల ఎవరికీ ఇబ్బంది కలగకూడదు. ముఖ్యంగా రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అందుకే మున్సిపల్ సిబ్బందితో వెంటనే సమన్వయం చేసి భారీ గేట్ ఏర్పాటు చేయించాం. శాశ్వత పరిష్కారంగా త్వరలో ఆ గుంతను పూడ్చి రోడ్డును బాగుచేయిస్తామని తెలిపారు.సమస్యను వెంటనే గుర్తించి పరిష్కారం చూపిన కౌన్సిలర్ చర్యను స్థానికులు అభినందించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గేట్ వల్ల ప్రమాదాలు తప్పుతాయని, త్వరగా శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి




**ముషీరాబాద్, ఆగస్టు 1(జనం సాక్షి):**ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలను ఆయా రాష్ట్రాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు గద్దె దింపారని, తెలంగాణ ప్రభుత్వం కూడా అదే వైఖరిని కొనసాగిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలాంటి పరిస్థితి నే ఎదుర్కోవాల్సి వస్తుందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ లోని ఇంద్ర పార్క్ వద్దగల ధర్నా చౌక్ లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేసి, కొత్త పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్)ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. పీఆర్సీ నివేదికను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మల్కా కోమరయ్య, ఏవీఎన్ రెడ్డి, అంజి రెడ్డి, బీజేపీ శాసనసభ పక్ష నేత యేలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మల్కా కోమరయ్య, ఏవీఎన్ రెడ్డి, అంజి రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. పీఆర్సీ ఫిట్‌మెంట్ ప్రకట ించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేసి, బకాయి బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. శాసన మండలిలో కూడా ఉపాధ్యాయుల సమస్యలను బలంగా ప్రస్తావిస్తామని తెలిపారు.బీజేపీ శాసనసభ పక్ష నేత యేలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి రావడం బాధాకరమని పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి, ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర నాయకులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కానుగంటి హనుమంతరావు, జోనల్ ఇన్చార్జీలు పర్వతం సంధ్యారాణి, భాస్కర్, శ్రీనివాస్, షేర్ కృష్ణారెడ్డి, ఉదయ్ కిరణ్, అంజిరెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యాచారం ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా పంబాల ఆంజనేయులు

### కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**యాచారం, ఆగస్టు 1(జనంసాక్షి )** యాచారం మండల కేంద్రంలో శనివారం ప్రింట్ మీడియా విలేకరుల సమావేశం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు మకపల్లి శ్రీనివాస్, 'నమస్తే తెలంగాణ' జర్నలిస్టు మడ్డి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో యాచారం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మకపల్లి శ్రీనివాస్, అధ్యక్షుడిగా పంబాల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఆలంపల్లి రవీందర్, ఉపాధ్యక్షులుగా ఎట్టి లక్ష్మణ్, గుండె రాఘవేందర్, కోశాధికారిగా మడ్డి యాదగిరి, ప్రచార కార్యదర్శిగా నరేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రామ్ చందర్, నరేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పంబాల ఆంజనేయులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జర్నలిస్టు మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ సమిష్టిగా ముందుకు సాగుతానని, జర్నలిజం విలువలకూ, బాధ్యతలకూ కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు.

## బృందావన్ కాలనీ సమస్యల పరిష్కారానికి ఎంపీ ఈటల రాజేందర్ హామీ



**హయత్ నగర్, ఆగస్టు 1 (జనం సాక్షి)**బృందావన్ కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ ప్రతినిధులు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను శనివారం కలిశారు. హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు ఎంపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి లైటింగ్ తదితర సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఈటల రాజేందర్, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందావన్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు. కాలనీ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరించిన కళ్లెం నవజీవన్‌కు, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ఎంపీ ఈటల రాజేందర్‌కు కాలనీ ప్రజల తరఫున బృందావన్ కాలనీ అధ్యక్షుడు పారంద మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయండి

### పూడూర్ తహసిల్దార్ విజయకుమార్



**పూడూర్, ఆగస్టు 01,( జనం సాక్షి)** గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని పూడూర్ తహసిల్దార్ విజయకుమార్ పేర్కొన్నారు శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బిఎల్ఓ లు ఎస్ ఐ ఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు మండలంలో ఇప్పటివరకు 80% పూర్తయిందని ,34,641 , డిజిటల్ లీకరణ పూర్తయిందని ఆయన అన్నారు మిగిలిన ఎస్ఐఆర్ ప్రక్రియను, వేగవంతంగా పూర్తి చేసి జిల్లాలోని అన్ని మండలాల కంటే పూడూర్ మండలం లో అందరికంటే ముందే 100% ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన అన్నారు ఓటు హక్కు ప్రతి ఒక్కరి జన్మహక్కని దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు



## రాంపల్లి గ్రామంలో నకిలీ డీఏపీ కలకలం.. 49 బస్తాలు సీజ్

**బంట్వారం ఆగస్ట్ 01 (జనం సాక్షి)** : బంట్వారం మండలంలోని రాంపల్లి గ్రామంలో 49 బస్తాల నకిలీ డీఏపీ ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి శ్రావ్య ఫిర్యాదు మేరకు పెద్దెముల్ గ్రామానికి చెందిన పోలరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విమల తెలిపారు. రైతులు కొనుగోలు చేసిన డీఏపీ ఎరువులు నకిలీవని నిర్ధారించిన అధికారులు వాటిని సీజ్ చేసి, ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

## విద్యుత్ సమస్యలకు పరిష్కారం

### సర్పంచ్ సుజాత నరసింహచారి చొరవతో విద్యుత్ సమస్యకు చెక్



**శంకర్ పల్లి, ఆగస్టు 01(జనం సాక్షి) :** మండలంలోని మహారాజ్ పెట్ గ్రామంలో రెండవ వార్డులో దీర్ఘకాలంగా లో వోల్టేజ్ తో ఇబ్బందులు పడుతున్న సమస్యను వార్డు మెంబర్ హరి ముదిరాజ్ సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లగా సర్పంచ్ విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వటంతో సర్పంచ్ వినతి విద్యుత్ శాఖ అధికారులు స్పందించి శనివారం 10 కెవిఎ ఉన్నటువంటి ట్రాన్స్ఫారము ను100 కేవీఏ ట్రాన్స్ఫారం ను ఏర్పాటు చేయడం జరిగింది.విద్యుత్ సమస్య పరిష్కారం అవ్వటంతో వార్డు మెంబర్ హరి ముదిరాజ్ తో పాటు గ్రామస్తులు సర్పంచ్ సుజాత నరసింహచారి పై హర్షం వ్యక్తం చేశారు.

## ముచ్చింతల్‌లో యువకుడు అదృశ్యం



**శంషాబాద్,ఆగస్టు1(జనంసాక్షి)** : శంషాబాద్ ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో మిస్సింగ్ కేసు నమోదైంది. ఫ్యూచర్ సిటీ ఇన్‌స్పెక్టర్ వై. సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, శంషాబాద్ మండలం ముచ్చింతల్ గ్రామంలో నివాసం ఉంటున్న పలగిరి రాజా మోహన్ రెడ్డి (29) అదృశ్యమైనట్లు ఆయన భార్య జమ్మలమడుగు ధామిని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు, జూలై 31 రాత్రి ఇంటి యజమాని శివప్రసాద్‌తో కలిసి పాలమాకుల గ్రామానికి ఆహారం తీసుకురావడానికి వెళ్లిన రాజా మోహన్ రెడ్డి, తిరిగి ఇంటి వద్దకు వచ్చిన అనంతరం కనిపించకుండా పోయాడు. అతని మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో పాటు బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు.అదృశ్యమైన రాజా మోహన్ రెడ్డి ఎత్తు 6 అడుగులు, చామనచాయ రంగు కలిగి ఉండి, చివరిసారిగా పసుపు రంగు టీ-షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ



**శంషాబాద్,ఆగస్టు1(జనంసాక్షి)** : ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. సుమారు 2,200 ఎకరాల్లో జీఎంఆర్ అభివృద్ధి చేసిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంలో ఆగస్టు 17 నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ విమానాశ్రయం తూర్పు భారతదేశానికి "గేట్‌వే ఆఫ్ ది ఈస్ట్"గా నిలిచి పర్యాటకం, వాణిజ్యం, ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతమివ్వనుందని జీఎంఆర్ తెలిపింది. ప్రారంభ దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో నిర్మించిన ఈ విమానాశ్రయాన్ని భవిష్యత్తులో 4 కోట్ల మంది ప్రయాణికులకు విస్తరించనున్నట్లు పేర్కొంది.

## కేఎస్ఆర్ లేఅవుట్‌లో నాసిరకం రోడ్ల నేపథ్యంలో చర్యలకై టీఆర్ఎస్ డిమాండ్



**శేరిలింగంపల్లి, ఆగస్టు 01 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ చందానగర్ డివిజన్ పరిధి కేఎస్ఆర్ లేఅవుట్లో నాసిరకంలో రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది ముమ్మాటికి వినియోగదారులను మోసం చేయడంతోపాటు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కడమేనని టిఆర్ఎస్ శేరిలింగంపల్లి ఇంచార్జ్ వాసిలి చంద్రశేఖర ప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చందానగర్ డివిజన్ పరిధిలోని కెఎస్ఆర్ లేఅవుట్‌లో నాణ్యతలేని నాసిరకం రోడ్లు వేయడంపై తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తూ అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది జూన్ 29న వేసిన తారు రోడ్డు, కేవలం 30 రోజులకే పూర్తిగా ధ్వంసమైందని ఆయన దుయ్యబట్టారు. కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు, మరియు అధికారులు చేతులు కలిపి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రోడ్లు వేయడంవల్లే ఈ పరిస్థితి దాపురించిందని, ఇది ముమ్మాటికీ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని ఆయన మండిపడ్డారు. స్థానిక ప్రజా ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకునే అభివృద్ధి అంటే ఇదేనా అని, శేరిలింగంపల్లిలో చాలా అద్భుతమైన అభివృద్ధి జరుగుతున్నట్టని ఆయన విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ఈ విషయంపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, నాణ్యతను పరిశీలించని క్వాలిటీ ఇన్‌స్పెక్షన్ అధికారులు, నాసిరకం రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను బహిరంగంగా డిమాండ్ చేశారు. సదరు కాంట్రాక్టర్‌కు ఎలాంటి అదనపు నిధులు చెల్లించకుండా, అతని సొంత ఖర్చులతో వెంటనే కెఎస్ఆర్ లేఅవుట్ లో కొత్తరోడ్డు వేయించి ప్రజాధనాన్ని కాపాడాలని స్పష్టం చేశారు. ఒకవేళ కాంట్రాక్టర్ మళ్లీ రోడ్డు వేయడానికి నిరాకరిస్తే, అతని లైసెన్స్‌ను రద్దు చేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని, ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పుడే మిగిలిన కాంట్రాక్టర్లు భయపడి రోడ్డు పనుల్లో నాణ్యత పాటిస్తారని వాసిలి చంద్రశేఖర్ పునరుద్ఘాటించారు.

## బోనాలు ప్రశాంతంగా జరగాలి.. పోలీసులతో సమన్వయం తప్పనిసరి

### ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో బోనాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం



**ఉప్పల్, ఆగస్టు 1 (జనంసాక్షి) :** బోనాలు--2026 ఉత్సవాలను పురస్కరించుకుని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోనాల నిర్వాహకులతో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పోలీసు అధికారులు నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీసులతో పూర్తి సమన్వయంతో ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, ఊరేగింపుల నిర్వహణ, ధ్వని కాలుష్య నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. అనుమతులు పొందిన మార్గాల్లోనే ఊరేగింపులు నిర్వహించాలని, చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్వాహకులు, యువత, స్వచ్ఛంద సేవకులు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. పరస్పర సహకారం, సామరస్యం, భక్తి భావంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమన్వయంతో వ్యవహరిస్తే ఉప్పల్‌లో బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా, వైభవంగా జరిగి ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తాయని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిపారు.

## కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించిన అరికెపూడి



**శేరిలింగంపల్లి, ఆగస్టు 01 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి న్యూ కాలనీలో వున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థకు సంబంధించిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ నిధులకు సంబంధించి 22 లక్షల రూపాయలతో నిధులతో నూతనంగా నిర్మించిన 2 అదనపు తరగతి గదుల భవనాన్ని మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి శనివారం రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థకు సంబంధించిన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన 2 అదనపు తరగతి గదులను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయమని, ఇది పాఠశాలకు సంబంధించి ఎంతో శుభపరిణామం అన్నారు. రెండు అదనపు తరగతులద్వారా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, వారి బంగారు భవిష్యత్తుకు తప్పకుండా పునాది లాంటిదని అన్నారు. ప్రాథమిక విద్య స్థాయిలో విద్యకు సంబంధించిన నిర్దిష్టమైన పునాది ఏర్పడడం ద్వారా భవిష్యత్తులో దాన్ని మరింత అద్భుతంగా మలుచుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ఇది ఒక రాజబాటగా ఉపయోగ పడుతుందని అరికెపూడి అభిప్రాయపడ్డారు. అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో, కొత్త సొగసులతో అదనపు తరగతి గదుల భవనాన్ని నిర్మించడం జరిగిందని, పిల్లలకు ప్రశాంతమైన వాతావరణం అందించడానికి ఇది తప్పకుండా దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ సమాజం కోసం సేవ చేయాలని, పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజానికి మంచిపేరు తీసుకురావాలని, విద్యార్థులు ఒక మంచి లక్ష్యం ఏర్పరచుకొని, క్రమశిక్షణ, ఏకాగ్రతతో, సడలని పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్నర్ స్టోన్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు కిరణ్, ఉషారాణి, భార్గవి, పవన్, తేజ్ కుమార్, నిర్మల, హరి చైతన్య, మంజుల, శ్రీకాంత్, శ్రీనివాసరావు, నికిత, జన్య ఫౌండేషన్ ప్రతినిధులు సురేంద్ర, చిరంజీవి, మరియు నాయకులు ప్రతాప్ రెడ్డి, ఉదయ్ కిరణ్, రవిచంద్ర రెడ్డి, అరుణ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయ ఆలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం

## నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



**ఉప్పల్ ఆగస్టు 01 ( జనం సాక్షి ):** హబ్సీగూడ ఎన్‌జీఆర్ఐ ప్రాంతంలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ దేవాదాయ అభివృద్ధి కమిటీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కమిటీ సభ్యులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఆలయాల పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి నూతనంగా నియమితులైన సభ్యులకు అభినందనలు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సభ్యులుగా బిక్కుమల అంజయ్య గుప్తా, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బజారు రామరాజు గౌడ్, భూసం రఘునాథ రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, వరకాల మదన్ గౌడ్, తాడి సుశీల, రోడ్ల దామోదర్ రెడ్డి, అలుగుబెల్లి వెంకట రెడ్డి, సుబ్బారావు, భూక్యా కిషన్ నాయక్, కడప నర్సింగ్, సంతోష్ కుమార్ నంద, బాబూలాల్ హరీష్ కుమార్ శర్మ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈఓ వెంకన్న, ప్రధాన అర్చకులు రవి కుమార్ శర్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగి రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, చన్ రెడ్డి రఘుపతి రెడ్డి, బజార్ జగన్నాథ్ గౌడ్, ఆకిటి ఆగం రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, మంద మురళీకృష్ణారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, బాబురావు, బొట్టు రాజేష్, భాస్కర్ రెడ్డి, బిక్కమల రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్, రామాలయం చైర్మన్ చింతల బాబురావు, సీనియర్ నాయకులు మురళీకృష్ణ ముదిరాజ్, రాజు నాయక్, రమేష్ నాయక్, లక్ష్మారెడ్డి, గుండు రాజన్న, మాలు నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు వాసు నాయక్, సాయి కుమార్, సాయి కిరణ్, సుమన్ నాయక్, లక్ష్మీ నారాయణ, శివ, అనిల్ మామిడాల, వినోద్ నాయక్తో పాటు ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పేదల భూముల సమస్యను పరిష్కరించాలి

## ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి



**హయత్‌నగర్, ఆగస్టు 1 (జనం సాక్షి)**హయత్ నగర్ రెవిన్యూ పరిధిలోని  సర్వే నెం. 255/1 భూముల సమస్యను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బాధితులతో కలిసి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. హయత్‌నగర్ మండల పరిధిలోని హన్మగల్-- హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలో ఉన్న సర్వే నెం. 255/1లో మొత్తం 74 ఎకరాల 37 గుంటల భూమి ఉండగా, అందులో సుమారు 18 ఎకరాలకు సంబంధించి వివాదం కొనసాగుతోందని నవజీవన్ రెడ్డి తెలిపారు. గతంలో ఈ భూముల్లో వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని, అనంతరం కొందరు రైతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చిన్నచిన్న ప్లాట్లుగా విభజించి పేద కుటుంబాలకు విక్రయించారని వివరించారు. ప్రస్తుతం సదరు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని, దీంతో పేద కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయని తెలిపారు. సమస్యను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకున్నారని, బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. పేదల హక్కులకు భంగం కలిగితే భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని నవజీవన్ రెడ్డి అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు చింతకింది ప్రవీణ్ రెడ్డి



**మొయినాబాద్( జనం సాక్షి )ఆగస్టు 01:** పాఠశాలల అభివృద్ధిలో భాగంగా విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు చింతకింది ప్రవీణ్రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్రెడ్డిలు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టిన అల్పాహార కార్యక్రమం శనివారం మండలంలోనిఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో సర్పంచ్లు, ఉపాధ్యాయులు కలిసి ప్రారంభించారు. ఈసందర్బంగా ఎతమార్పల్లిలో ప్రవీణ్ రెడ్డి, కాశీం బౌలిలో రాజేందర్రెడ్డి, అమ్డాపూర్ లో మద్యపాగ కృష్ణలు పాల్గొని విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించడం అభినంద నీయమన్నారు. విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలకు రావడంతో వారికి సక్రమంగా అల్పాహారం అందకపోవడం మూలానా అలాంటి పరిస్థితులు ఉండకూడదనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకోని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్డాపూర్ సర్పంచ్ మద్యపాగ కృష్ణ, కాశీంబౌలి సర్పంచ్ రాజేందర్రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రేణుక, కోఆప్షన్ సభ్యులు నర్సింహ్మాచారి, వార్డు సభ్యులు మిద్దె స్వాతివిజయేందర్రెడ్డి, మంగలి శ్రీరాములు, చాకలి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కీ.శే.పట్నం రుక్కమ్మ కు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే



**తాండూరు అగస్టు 1(జనంసాక్షి)**మాతృ వియోగానికి గురైన శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ  చిత్రపటానికిబిఆర్ఎస్ తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తన ప్రగాఢ సానుభూతిని పట్నం మహేందర్ రెడ్డి తో పాటు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, షాబాద్ మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి లకు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి విజయ్ కోట్ల మహిపాల్ మరియు తదితరులు ఉన్నారు.

# భీమ్రావు నగర్ సమస్యల పరిష్కారానికి కృషి

## కాలనీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ శాంతి

**అల్వాల్, ఆగస్టు 1 (జనంసాక్షి):** ఆల్వాల్ మున్సిపల్ పరిధిలోని భీమ్రావు నగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని అంతర్గత రహదారులు దెబ్బతినడం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిసినప్పుడు రహదారులు బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తానని శాంతి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాల్, శ్రీధర్, ప్రసాద్, జగదాంబ, రమాదేవి, లత, లక్ష్మీ, పూజ, మంగ, లింగారెడ్డి, శరణ్ గిరి, సాజిద్, మహేందర్ గౌడ్ తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ లో చేరిన ఏబీవీపీ నాయకుడు నరేందర్



**కేశంపేట ఆగస్టు 1(జనం సాక్షి ) :** మండల పరిధిలోని కొనాయిపల్లి గ్రామానికి చెందిన  ఏబీవీపీ నాయకుడు సొప్పరి నరేందర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్  నరేందర్ కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజాసేవలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, కొనాయపల్లి సర్పంచ్ సోప్పరి ధనలక్ష్మి రామకృష్ణ, సంగెం సర్పంచ్ వేణుగోపాల చారి, మాజీ సర్పంచ్ నవీన్ కుమార్, నాయకులు శ్రీహరి యాదవ్ , సలీం,  శ్రీకాంత్,  సంతోష్ రెడ్డి, సునీల్, చెన్నయ్య, మహేష్, రాకేష్ పాల్గొన్నారు.

# బంట్వారం మోడల్ స్కూల్ విద్యార్థులకు షూస్ పంపిణీ



**బంట్వారం ఆగస్ట్ 01 (జనం సాక్షి)**బంట్వారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో విద్యార్థులకు శనివారం షూస్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ బ్యూలా ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా షూస్ అందజేశారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ప్రిన్సిపల్ బ్యూలా సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ తీరుపై మంత్రి ఫైర్

**షాబాద్, ఆగస్టు 1 (జనంసాక్షి):** షాబాద్ తహశీల్దార్ పనితీరుపై రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కేటాయించే ప్లాట్లకు సంబంధించిన గోప్య సమాచారాన్ని ముందుగానే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు చేరవేస్తున్నారని మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి, బాధిత రైతులు చేసిన ఫిర్యాదుపై స్పందించిన మంత్రి అధికారులతో నేరుగా మాట్లాడి విచారణకు ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం, అక్రమాలు, అధికార దుర్వినియోగం ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేశారు.

ప్రభుత్వ అధికారులు ప్రజలకు సేవ చేయడానికే ఉన్నారని, దళారులు లేదా భూ వ్యాపారుల ప్రయోజనాల కోసం పనిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు కేటాయించే ప్లాట్ల వివరాలు బయటకు చేరడం అత్యంత తీవ్రమైన అంశమని పేర్కొన్నారు. రైతుల హక్కులకు భంగం కలిగించే చర్యలు ప్రభుత్వంపై ప్రజల్లో అనుమానాలకు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

భూ రికార్డులు, ప్లాట్ల కేటాయింపుల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ సమాచారం దుర్వినియోగం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల్లో వాస్తవాలు తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తోందని, బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. రెవెన్యూ శాఖపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

**మంత్రి స్పష్టమైన ఆదేశాలు**

- రైతుల ఫిర్యాదులపై సమగ్ర విచారణ
- భూ సమాచారం లీక్‌పై బాధ్యుల గుర్తింపు
- అక్రమాలు తేలితే కఠిన చర్యలు
- రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకతకు చర్యలు

# మొయినాబాద్‌కు రూ.4.25 కోట్ల అభివృద్ధి వరం

**మొయినాబాద్, ఆగస్టు 1 (జనంసాక్షి):** మొయినాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.4.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సాధారణ కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. అజీజ్‌నగర్‌లో నూతన కౌన్సిల్ హాల్, చైర్‌పర్సన్ ఛాంబర్‌ను ప్రారంభించిన అనంతరం శనివారం నిర్వహించిన సమావేశంలో ప్రజా సౌకర్యాలు, పారిశుధ్యం, మౌలిక వసతుల విస్తరణకు సంబంధించిన పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. 26 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, గ్రావెలింగ్, ప్యాచ్‌వర్క్ పనులతో పాటు జేసీబీ, జెట్టింగ్ మిషన్, ట్రాక్టర్ ఇంజిన్లు తదితర యంత్రాల కొనుగోలుకు కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్వహణ, ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు, ప్రజా మరుగుదొడ్లు, మున్సిపల్ కార్యాలయానికి ఆర్‌వో ప్లాంట్, కంప్యూటర్లు, ప్రింటర్లు, ప్రొజెక్టర్ కొనుగోలుకు కూడా ఆమోదం తెలిపింది. స్వచ్ఛ భారత్ మిషన్-యూ 2.0 కింద ఘన వ్యర్థాల నిర్వహణ, మున్సిపల్ ఆస్తుల డిజిటల్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్, వనమహోత్సవ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల వినియోగానికి అనుమతి ఇచ్చారు. వీధి దీపాల నిర్వహణను పీటీసీ ఇండియా లిమిటెడ్ ద్వారా చేపట్టాలని నిర్ణయించారు. బోనాల పండుగ సందర్భంగా 26 వార్డుల దేవాలయాల వద్ద లైటింగ్, సౌండ్ సిస్టమ్ తదితర తాత్కాలిక ఏర్పాట్లకు అవసరమైన వ్యయానికీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు.



# చందానగర్‌లో ఆభరణాల దుకాణాలకు భద్రతా ఆడిట్

## భారీ చోరీ ఘటన నేపథ్యంలో డీసీపీ శ్రీనివాస్ ఆదేశాలు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 1 (జనంసాక్షి):** చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన భారీ ఆభరణాల దుకాణం చోరీ ఘటన నేపథ్యంలో అన్ని జ్యువెలరీ షాపుల్లో సమగ్ర భద్రతా ఆడిట్ నిర్వహించాలని మాదాపూర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ఆదేశించారు. ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టడం, భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

పోలీసులు రూపొందించిన 21 అంశాల భద్రతా మార్గదర్శకాల అమలును ఈ ఆడిట్‌లో పరిశీలించనున్నారు. సీసీటీవీ కెమెరాల పనితీరు, అలారం వ్యవస్థలు, స్ట్రాంగ్‌రూమ్ భద్రత, యాక్సెస్ కంట్రోల్ విధానాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. ఈ ఆడిట్ ద్వారా దుకాణ యజమానులు తమ సంస్థల్లో ఉన్న భద్రతా లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని డీసీపీ పేర్కొన్నారు. ఉత్తమ భద్రతా ప్రమాణాలను అమలు చేసి భవిష్యత్తులో చోరీలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాలను నివారించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. చందానగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో డీఐ ప్రదీప్, ఎస్సై రాధిక, ఏఎస్సైలు అశోక్, సీనయ్య, యాదమ్మ, హెడ్ కానిస్టేబుళ్లు పద్మనాభం, శివకుమార్, విఠలయ్యతో పాటు ఇతర సిబ్బంది ఈ భద్రతా ఆడిట్ నిర్వహించనున్నారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ఆభరణాల దుకాణాలను కవర్ చేసేందుకు మొత్తం ఆరు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దుకాణ యజమానులు ఆడిట్ ప్రక్రియకు పూర్తి సహకారం అందించి, గుర్తించిన భద్రతా లోపాలను వెంటనే సరిదిద్దుకోవాలని పోలీసులు సూచించారు.



# దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

## ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

**యాలాల ఆగస్టు 1(జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా యాలాల మండలం జక్కేపల్లి గ్రామంలో దాయాదుల దాడిలో తీవ్రంగా గాయపడి తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంబురప్ప కుమారుడు లక్ష్మణ్‌ను శనివారం ఆర్బిఓఎల్ సీఈఓ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుయ్యని శీనన్న పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా విధుల్లో ఉన్న వైద్యులను కలిసి లక్ష్మణ్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి దాడికి దారితీసిన పరిస్థితులను వివరంగా ఆరా తీశారు. లక్ష్మణ్‌కు ఎటువంటి లోటు లేకుండా అవసరమైన అన్ని వైద్య సేవలు అందించి మెరుగైన చికిత్స చేయాలని ఆస్పత్రి వైద్య సిబ్బందిని శ్రీనివాస్ రెడ్డి కోరారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం కూడా అందేలా చూస్తామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనంతరం యాలాల ఎస్ఐ విటల్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన శీనన్న, దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రహ్లాద్ కులకర్ణి, సత్యమూర్తి, అఖిల్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ డీఏపీ దందాపై సమగ్ర విచారణ జరిపించాలి

## సీఎం సొంత జిల్లాలోనే నకిలీల రాజ్యమా..?

- బాధితులకు పరిహారం చెల్లించాలి : బీజేపీ నేత యు. రమేష్ కుమార్.



తాండూరు అగస్టు 1(జనంసాక్షి)నల్లటి నేలలో చెమటోడ్చి బంగారాన్ని పండించే అన్నదాతల జీవితాలతో నకిలీ మాఫియా చెలగాటమాడు తోందని, సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలోనే ఈ దందా సాగడం శోచనీయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు యు.రమేష్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి, తాండూరు ప్రాంతాల్లో వెలుగుచూసిన నకిలీ డీఏపీ ఎరువుల కుంభకోణంపై ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.రైతులను నమ్మించేందుకు బస్తాలపై ఏకంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించి, లోపల సున్నం, మట్టి కలిపి విక్రయిస్తున్నారని మండిపడ్డారు. వేలల్లో అప్పులు చేసి ఎరువులు కొనుగోలు చేసి అమాయక రైతులు పొలాల్లో చల్లిన తర్వాత మోసపోయామని తెలుసుకుని కన్నీరుము న్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటికి మొన్న పరిగిలో రూ.35 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు దొరకడం, ఇప్పుడు నకిలీ డీఏపీ బయటపడటం విజిలెన్స్, పోలీసు యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈ దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులను వదిలేసి, పోలీసులు కేవలం మధ్యవర్తులను పట్టుకుని చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ప్రధాన నిందితుల జాడ ఇప్పటివరకు దొరకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న మాస్టర్ మైండ్స్‌ను బయటకు తీసి, రైతుల జీవితాలతో ఆడుకుంటున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులైన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని, నకిలీ రాయితీ ఎరువులను అమ్ముతున్న వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

# అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

- విద్యుత్ సమస్యలపై సభ్యుల ఆగ్రహం.. ఏఈ తీరుపై మండిపాటు
- పాఠశాలల నిర్వహణ అధ్వాన్నమంటూ ఎంఈఓకు ప్రశ్నల వర్షం
- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అసమానతలపై అభ్యంతరాలు
- ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశంలో వాడీవేడీ చర్చ



**రంగారెడ్డి, ఆగస్టు 1 (జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం అధికారులపై ప్రజాప్రతినిధుల ప్రశ్నలతో హోరెత్తింది. విద్యుత్ సమస్యలు, గ్రామపంచాయతీల ఆర్థిక ఇబ్బందులు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, గ్రామీణ మౌలిక వసతులపై సర్పంచులు, ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఎంపీడీవో ప్రమీల అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో పలువురు అధికారులు సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి వచ్చింది. మండలంలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, లూజ్ వైరింగ్ కారణంగా పశువులు మృతి చెందుతున్నా విద్యుత్ శాఖ స్పందించడం లేదని సభ్యులు మండిపడ్డారు. విద్యుత్ శాఖ ఏఈ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన డీఈ సీతారామ్, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, లూజ్ వైరింగ్‌ను తక్షణమే సరిచేస్తామని హామీ ఇచ్చారు.

గ్రామపంచాయతీలకు నిధుల కొరత తీవ్రంగా ఉందని, వచ్చిన నిధులన్నీ విద్యుత్ బిల్లుల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగిన నిధులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారిందని, పాఠశాల ఆవరణలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయని సభ్యులు ఆరోపించారు. ప్రధానోపాధ్యాయులు గ్రామపంచాయతీ సమావేశాలకు హాజరు కావడం లేదని, మండల విద్యాధికారి క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాలని సూచించారు. దీనిపై మండల విద్యాధికారి హీర్యా నాయక్ స్పందిస్తూ, ప్రతి వారం పాఠశాలలను తనిఖీ చేస్తున్నానని, ఇకపై సర్పంచులకు సమాచారం ఇచ్చి పర్యటిస్తానని తెలిపారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణంపై కూడా సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలానికి మంజూరైన 438 ఇళ్లలో 114 మాత్రమే పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. కప్పాడు గ్రామంలో 43 ఇళ్లు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంపై సభ్యులు అభ్యంతరం తెలిపారు. లబ్ధిదారులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయని సర్పంచులు పేర్కొన్నారు. అవసరం లేని గ్రామాలకు ఎక్కువ ఇళ్లు, అవసరమైన గ్రామాలకు తక్కువ కేటాయింపులు జరిగాయని సభ్యులు ఆరోపించారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల నుంచి లిఖితపూర్వక సమ్మతి తీసుకుని వాటిని రద్దు చేసి రెండో విడత అర్హులైన లబ్ధిదారులకు కేటాయిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి తెలిపారు. సభ్యులు ప్రస్తావించిన ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి నవీన్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, ఎంపీఓ ఉషాకిరణ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటిన బిజెపి నాయకులు

### ప్రమాదంలో చేయి కోల్పోయిన కార్మికుడికి ఆర్థిక చేయూత



**సికింద్రాబాద్(జనంసాక్షి):** ప్రమాదంలో చేయి కోల్పోయిన ఆనంద్ అనే కార్మికుడికి బిజెపి నాయకులు, సమాజ సేవకుడు శ్రీరామ్ వెంకటేష్ ఆర్థిక చేయూత అందించి మానవత్వం చాటుకున్నారు. తార్నాక స్ట్రీట్ నెంబర్ 3లో చిన్న డబ్బా పెట్టుకొని, సోఫా మరమ్మత్తుల పని చేస్తూ ఆనంద్ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పని చేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో ఆనంద్ చేయి పూర్తిగా తెగిపోయింది. ఈ విషాదకర ఘటన గురించి తెలుసుకున్న శ్రీరామ్ వెంకటేష్ వెంటనే బీజేపీ నాయకులతో కలిసి బాధితుడు ఉన్న ఆసుపత్రికి చేరుకుని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.శ్రీరామ్ వెంకట్ తన స్వంత నిధుల నుంచి రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆ చెక్కును బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి , బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేష్ గౌడ్ చేతుల మీదుగా బాధితుని కుటుంబానికి అందజేశారు.అంతేకాకుండా శ్రీరామ్ వెంకటేష్ చికిత్సకు అవసరమైన అన్ని మందులు, తదుపరి వైద్య ఖర్చులకు కూడా తమ వంతు సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ....కష్టాల్లో ఉన్న శ్రమజీవులకు అండగా నిలవడం నిజమైన మానవత్వం అని ఆయన చెప్పారు. సమాజంలోని అవసరమైన వ్యక్తికి చేయూత అందిస్తూ , తన వంతు సహాయం చేయడం బిజెపి నాయకుడుగా తాను గర్వపడుతున్నానని తెలిపారు. సహాయ, సహకారాలు అందించడం బిజెపి సిద్ధాంతాలకు నిదర్శనం అని ఆయనపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దత్తు, బహనుమంత్ ముదిరాజ్, తార్నాక డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు కరుణాకర్ , భాను ప్రకాష్, శ్రీకాంత్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డిని జెసిపి తో తొలగించిన గ్రామ సర్పంచ్

### గంజాయి రేణుక రాములు



**నవాబుపేట్ ఆగస్టు 1( జనం సాక్షి)**నవాబుపేట్ మండల పరిధిలోని అర్కతల గ్రామంలో ఉన్నటువంటి బిటి రోడ్డు అర్కతల గ్రామం నుండి గేట్ వరకు మూడు కిలోమీటర్ల దూరం రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డిని జెసిపి తో శనివారం తీసివేయించిన గ్రామ సర్పంచి గంజాయి రేణుక రాములు గ్రామం నుంచి నవపేట్ గేట్ వరకు సుమారు మూడు కిలోమీటర్లు కలిపి ఇరువైపులా మూడు ఫీట్లు దూరం ఉన్న గడ్డిని చెట్లను తీసి వేయించడం అయినది. వర్షాకాలం వస్తున్న సందర్భంగా ఇరువైపులా ఉన్న రోడ్డు పక్కన ఉన్న గడ్డిని ప్రజలు రోడ్లపై వెళుతున్న సందర్భంగా పాములు పురుగులు వచ్చి ప్రజలను ఇబ్బందులు చేయడం కంటే ముందుగానే ప్రజలకు జాగ్రత్తపడి విధంగా రోడ్డు పక్కన ఉన్న గడ్డి చెట్లను తీసివేస్తున్నట్లు సర్పంచ్ రేణుక తెలిపారు పంచాయతీ కార్యదర్శి స్వప్న ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ కార్మికులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జెసిపి ని పెట్టి చిత్త చిదాన్ని తీసివేయడమైనది తెలిపారు.వేయించడం జరిగింది సూచనల మేరకు రోడ్డు వేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి శివ నీల భాగయ్య పంచాయతీ వార్డ్ సభ్యులు గ్రామ పెద్దలువడ్డే వెంకటయ్య,కావలి అంజయ్య, పోలీస్ మల్లారెడ్డి, పోలీస్ బుచ్చిరెడ్డి, మాలిష్ మాణిక్ రెడ్డి,మాజీ సర్పంచ్ వడ్డే రాములు, మాజీ ఉపసర్పంచ్ ఇంద్రుపాటి సంగారెడ్డి,అదేవిధంగా మండల యూత్ కమిటీ ప్రెసిడెంట్ తలారి శేఖర్, గ్రామ పెద్దలు యువజన సంఘాల నాయకులు డ్వాక్రా మహిళలు యువజన సంఘాల నాయకులు హరికృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారం

### తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివి



**(జనంసాక్షి )ఫరూఖ్ నగర్ ఆగస్టు 1:**ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించొడ్ ఏరియా లోని సబ్ సెంటర్ షాద్నగర్ "ఏ" అవుట్ రీచ్ ఏరియా 6వ అంగన్వాడి సెంటర్లో జరుగుతున్న వ్యాధి నిరోధక కార్యక్రమం లో వచ్చిన తల్లులందరికీ, తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి హెల్త్ ఎడ్యుకేటర్ జె శ్రీనివాసులు వివరించారు. తల్లి పాలు శిశు వుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారము అని, పాప పుట్టిన వెంటనే మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం చాలా ముఖ్యం అని, పాప పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు తప్పకుండా తల్లిపాలు మాత్రమే పట్టించాలి అని, 6 నెలల తరువాత అదనపు ఆహారం ప్రారంభించినప్పటికీ, 2 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలము తల్లిపాలను కొనసాగించడం మంచిదని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు చెప్పారు.శిశువుకు తల్లిపాల వల్ల ప్రయోజనాలు ఏమిటి అనగా తల్లి పాలవలన శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు సరైన మోతాదులు లభిస్తాయి అని, తల్లిపాల వలన రోగ నిరోధక శక్తి పెరిగి, ఇన్ఫెక్షన్లు తగ్గుతాయని, మరియు విరేచనాలు, న్యూమోనియా,చెవి ఇన్ఫెక్షన్ల వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది అని, తల్లిపాల వలన శిశు మెదడు ఎదుగుదల, జ్ఞాపకశక్తి మరియు తెలివితేటలు పెరుగుతాయని చెప్పారు. తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి కలిగే ప్రయోజనాలు ఏమనగా తల్లి పాలు శిశువుకు ఇవ్వడం వలన తల్లి ప్రసవం తర్వాత గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి వస్తుంది అని, ప్రసవానంతరము రక్తస్రావము తగ్గుతుంది అని, తల్లి పాలు ఇవ్వడం వలన రొమ్ము క్యాన్సర్ మరియు అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని, సహజంగా కొంతకాలము గర్భధారణ మధ్య విరామం కల్పించడంలో సహాయపడుతుంది అని, తల్లి ఆరోగ్యం మెరుగుపడి కుటుంబానికి ఆర్థికంగా కూడా ప్రయోజనం కలుగుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు.ముర్రు పాలు ప్రాముఖ్యత ఏమనగా. తల్లి ప్రసవం తర్వాత మొదట వచ్చే పసుపు రంగు పాలనే మురుపాలు అంటారు అని, ఈ పాలలో వ్యాధి నిరోధక పదార్థాలు (యాంటీబాడీలు) అధికంగా ఉంటాయి అని, ముర్రు పాలు శిశువుకు మొదటి టీకా వంటివి అని,కాబట్టి వీటిని తప్పకుండా ఇవ్వాలని తల్లులకు జె. శ్రీనివాసులు తెలియజేశారు.తల్లులు గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయాలు .పాప పుట్టిన మొదటి గంటలో తల్లిపాలను ప్రారంభించాలి. మొదటి ఆరు నెలలు,తేనె,గ్లూకోజు నీరు లేదా ఇతరహారము ఇవ్వకూడదు,శిశువుకు అవసరమైనప్పుడు (పగలు, రాత్రి) తరచుగా పాలు ఇవ్వాలి అని,తల్లి పాలు ఇవ్వడం వలన శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడు అని మరియు తల్లి ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని హెల్త్ ఎడ్యుకేటెర్ శ్రీనివాసులు తెలియజేశారు. తల్లులకు బాల అమృతము గురించి దాని యొక్క ఉపయోగాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జయమ్మ, ఏ.ఎన్.ఎమ్. ఇస్తేరు రాణి, ఆశాలు మరియు తల్లులు పాల్గొన్నారు.



## పోచమ్మ తల్లి దీవెనలతో సర్వం సుభిక్షంగా ఉండాలి

### బాలాజీ నర్సింగ్ హెూమ్ వైద్యులు సంపత్ కుమార్



**తాండూరు అగస్టు 1(జనంసాక్షి)**పోచమ్మ తల్లి దీవెనలతో సర్వం సుభిక్షంగా ఉండాలనిబాలాజీ నర్సింగ్ హెూమ్ వైద్యులు సంపత్ కుమార్ పేర్కొన్నారు. తాండూరు మున్సిపల్ ఫరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో వెలసిన శ్రీ పోచమ్మ తల్లి దేవస్థానంలో డాక్టర్ సంపత్ కుమార్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీర్వాదాలు తాండూర్ ప్రజలందరిపై ఉండాలని, అమ్మవారి కరుణాకటాక్షాలు అందరికీ లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. భక్తులందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో కోర్వార్ నగేష్, ప్రకాష్, విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశ్వనాథ్ పాల్గొన్న అందరినీ ఘనంగా సన్మానించారు. పూజలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### బోనాల పండుగ చెక్కుల పంపిణీ -- రూ.1.08 కోట్లకు పైగా నిధుల పంపిణీ



ముషీరాబాద్, ఆగస్టు 1(జనం సాక్షి): ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముషీరాబాద్ శాసనసభ్యులు ముటా గోపాల్ అన్నారు. ఈ మేరకు శనివారం దేవుని తోట దేవాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని బోనాల పండుగ నిర్వహణ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ముషీరాబాద్ శాసనసభ్యులు ముటా గోపాల్ పంపిణీ చేశారు. రూ. 1,08,75,880 విలువైన మొత్తం 202 చెక్కులను ఆలయ కమిటీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముటా గోపాల్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముటా జయసింహ, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షులు వై. శ్రీనివాసరావు, కొండ శ్రీధర్ రెడ్డి, ఎం. రాకేష్ కుమార్, శ్యామ్ యాదవ్, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర నాయకులకు స్వాగతం

### మండలాధ్యక్షుడు రామకృష్ణ.



**జిల్లేడుచౌదరిగూడ (జనం సాక్షి)**మహబూబ్నగర్ పార్టీనా యకులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమననికి వెళ్తున్న రాష్ట్ర జనసేన పార్టీ ఆర్కే సాగర్, నీసిత్, నాయకులు షాద్నగర్ మీదుగా వెళ్తున్న విషయం తెలుసుకొని జిల్లేడు చౌదరి గూడ మండల అధ్య క్షుడు బొమ్మగల రామకృష్ణ స్వాగతం పలికారు.తనను రాష్ట్ర నాయకులు అభినందించారాణి తెలిపారు.



## గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరం

**సర్పంచ్ లక్ష్మణ్ గౌడ్**

**కొడంగల్, ఆగస్టు 01(జనం సాక్షి):** గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని సర్పంచ్ లక్ష్మణ్ గౌడ్ అన్నారు. కొడంగల్ మండలం కస్తూర్‌పల్లి గ్రామంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వార్షిక ప్రణాళిక ఎన్ఆర్ఈజీఎస్ 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి ఇంటికి ఇంటి కుంట, ప్రతి ఊరికి ఊట కుంట నిర్మాణానికి గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి జగదీష్ గౌడ్ ,ఉపసర్పంచ్ సుజాత పుష్పల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌కు ఆగస్టు 10 వరకు గడువు

- అదనపు సమయాన్ని నాణ్యత పెంపునకు వినియోగించాలి
- రంగారెడ్డి అధికారులతో ఎన్నికల సంఘం కార్యదర్శి సమీక్ష
- బీఎల్‌వోలు వివరాల ధృవీకరణపై ప్రత్యేక దృష్టి
- సమీక్ష అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలన






**రంగారెడ్డి, ఆగస్టు 1 (జనంసాక్షి):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో లభించిన అదనపు సమయాన్ని నాణ్యత పెంపునకు పూర్తిస్థాయిలో వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ అమలు సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఎన్నికల సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని అన్నారు. ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారులు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు, ఫొటో లు, పత్రాల అప్‌లోడ్‌లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ధారించాలని సూచించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని సూచించిన ఆయన, ప్రభుత్వ భవనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రైవేట్ భవనాలను వినియోగించాలని చెప్పారు. మరణించిన, చిరునామా మార్చుకున్న, గుర్తించలేని ఓటర్ల వివరాలను కుటుంబ సభ్యులు, స్థానిక సమాచారం ఆధారంగా మరోసారి ధృవీకరించాలని సూచించారు. అవసరమైతే అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు కనిపించడం లేదని, బీఎల్‌వోలు అందుబాటులో లేరని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్న ఆయన, అలాంటి సందర్భాల్లో ప్రజలకు పూర్తి సహకారం అందిస్తూ అవసరమైన దరఖాస్తులు స్వీకరించాలని బీఎల్‌వోలకు సూచించారు.

రంగారెడ్డి జిల్లాలో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్న తీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే ఉత్సాహంతో మిగిలిన ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేయాలని ఆకాంక్షించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,501 పోలింగ్ కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం 63.53 శాతం మ్యాపింగ్ పూర్తైందని, పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్, డూప్లికేట్, నో మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఆగస్టు 10 వరకు గడువు పొడిగించడం వల్ల ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేసే అవకాశం లభించిందన్నారు. రాజకీయ పార్టీలతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి అపోహలను తొలగించామని, బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి పెండింగ్ కేసులను సంయుక్తంగా ధృవీకరిస్తామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీల్లోనే సాధ్యమైనంత వరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రారంభం నుంచి నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. సమీక్ష అనంతరం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అదనపు కలెక్టర్ కె. కిరణ్మయితో కలిసి కొంగరకలాన్, బొంగులూరు, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. బీఎల్‌వోలతో మాట్లాడి ప్రక్రియ నిర్వహణ, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు.

## శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవాల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్ ఆగస్టు 1 జనం సాక్షి :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని గాగిల్లాపూర్ తాండ-2 లో ఘనంగా శనివారం నిర్వహించిన శ్రీశ్రీ శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవాలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. అమ్మవారి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, సిద్ధునోళ్ల సంజీవ్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొట్ల విజయ్ కుమార్, కె. భిక్షపతి నాయక్, ఎల్. శ్రీను నాయక్, డి. రాజు నాయక్, డి.



నెహ్రూ నాయక్, కె. హనుమంతు నాయక్, ఎల్. ప్రేమ్ సింగ్ నాయక్, టి. శ్రీను నాయక్, కె. ప్రవీణ్ నాయక్,కె. కన్నా నాయక్, ఆర్. కుమార్ నాయక్, కె. స్వామి నాయక్, డి. గణేష్ నాయక్, జె. నరేందర్ నాయక్, కె. మదన్ నాయక్, డి. విజయ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నారేగూడెం గ్రామాన్ని ఆదర్శంగా చేయడమే నా లక్ష్యం..!!

- గ్రామంలోని సమస్యలు చేరాలంటే గ్రామ సభలే ముఖ్యం
- గ్రామ సర్పంచ్ వెల్వర్తి దీపిక దశరథ్

**నవాబుపేట్ ఆగస్టు 1( జనం సాక్షి) :** నవాబుపేట్ పరిధిలోని నారే గూడెం గ్రామాన్ని ఆదర్శంగా తీ ర్చి దిద్దడమే నా లక్ష్యం అంటూ శనివారం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించిన సందర్భంగా. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి గల్లి గల్లికి సిసి రోడ్లను నిర్మించి అండర్ డ్రైనేజీ, వీధి దీపాలను, మంచినీటి సమస్యను తీర్చి దిద్దడమే గ్రామసభ గ్రామంలోని సమస్యలు ఎక్కడి ఏ వార్డుకల్లోను ఉన్నటువంటి సమస్యను గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభలో సమస్యలను తీసుకువచ్చినట్లయితే గ్రామ సభలో 100 సమక్షంలో గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి అందరం ఇక తడి పై నిలుచుండి గ్రామాన్ని ఆదర్శంగా చేయాలని సర్పంచి దీపిక తెలిపారు. గ్రామంలోని ఏడవ వార్డులో విద్యుత్ సమస్య గత 15 రోజుల నుండి లైన్మెన్ కు ఎన్నిసార్లు విన్నవించిన చేద్దాంలే అంటూ వెళ్ళిపోతున్నారు. గత నాలుగు రోజుల నుండి భారీ వర్షం కురుస్తున్న సందర్భంగా రెండు స్తంభాలు పెరిగిపడే విధంగా కనిపిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని గత ఆరు నెలల నుండి ఎప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు గ్రామం సమస్యలు గ్రామస్తుల ఆధ్వర్యంలో తీర్చి దిద్దినందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని



పంచాయతీ కార్యదర్శి శోభ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో అడక్ కమిటీని నెరవేసినట్లయితే కమిటీలో 11 మంది సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలో ఏ సమస్య ఉన్న ఈ యొక్క కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సమస్యలు తీర్చిదిద్దే విధంగా ఈ యొక్క కమిటీ నిర్వహించి గ్రామ సర్పంచ్ అన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంకొక గుంతలు తప్పకుండా నిర్వహించి గ్రామంలోని ప్రతి రైతు పొలంలో ఇంకుడు గుంత, ఇంటి వద్ద ఒక గుంట, ఒక ఊట కుంట తప్పకుండా నిర్వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శోభ, జిపిఓ పరమేష్, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ వార్డు సభ్యులు, డ్వాక్రా మహిళలు, యువజన సంఘాల నాయకులు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, గ్రామం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలలోనే బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలు

**సర్పంచ్ రేణుక దేవి కిషన్ రావు**




**యాలాల ఆగస్టు 1(జనంసాక్షి) :** తల్లి పాలలోనే బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలు ఉన్నాయని సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు వెల్లడించారు.ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం దేవనూర్ మరియు దుబ్బల తండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవనూర్ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ రేణుకా దేవి మాట్లాడుతూ పుట్టిన వెంటనే గంటలోపు తల్లి పాలు ఇవ్వడం, పుట్టిన 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వడం ప్రతి తల్లి బాధ్యత. తల్లి పాలలోనే బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలు ఉంటాయి. వాటితోనే పిల్లలు ఆరోగ్యంగా, తెలివిగా ఎదుగుతారని తెలిపారు.అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు మరియు ఏ.ఎన్.ఎం లు గ్రామ మహిళలకు తల్లి పాల ప్రాముఖ్యత, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. గర్భిణీలు మరియు బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల పాల్గొన్నారు.

## రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి

**శంకర్ పల్లి , ఆగస్టు 01 (జనం సాక్షి) :** గుర్తుతెలియని రైల్లో నుంచి జారిపడి గుర్తుతెలియని (50–60 సంవత్సరాల మధ్య) వృద్ధురాలు మృతి చెందిన సంఘటన వికారాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ హరి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారంగా శంకర్పల్లి మండలం కొండాకల్ రైల్వే గేట్ సమీపంలో ( నాగులపల్లి శంకర్పల్లి రైల్వే స్టేషన్ల మధ్య ) శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో నడుస్తున్న రైలు నుంచి గుర్తు తెలియని వృద్ధురాలు జారిపడిందని తెలిపారు.దీంతో ఆమె తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కాగా రైల్వే ట్రాక్ చెక్ చేసే కీమేన్ శ్రీనివాస్ వృద్ధ మహిళ చనిపోయిన విషయాన్ని గుర్తించి శంకర్పల్లి రైల్వే స్టేషన్ మాస్టర్ కు సమాచారం ఇవ్వగా స్టేషన్ మాస్టర్ వికారాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. వికారాబాద్ రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పంచనామా నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు పంచనామా పూర్తి చేసిన అనంతరం శవాన్ని అక్కడే భద్రపరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతురాలు ఎడమ చేతి పైన లచ్చమ్మ అని తెలుగులో పచ్చబొట్టు రాసి ఉందని, కుడి చేతికి స్టార్ ఆకారంలో పచ్చబొట్టు ఉందని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతురాలు ఒంటిపైన నీలం రంగు లంగా గులాబీ రంగు బంగారం అంచు కలిగిన జాకెట్టు పచ్చ రంగుల చేతి గాజులు ధరించి ఉందని వివరించారు. మృదురాలి బంధువులు ఎవరైనా శవాన్ని గుర్తించేటట్లయితే 7702629707 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# ఆషాఢానికే ఉప్పల్ గ్రామ బోనాలు

- గ్రామస్థుల ఐక్య స్వరానికి ఆలయ కమిటీ సానుకూల స్పందన
- వచ్చే ఏడాది నుంచి ఆషాఢ మాసంలోనే ఉత్సవాలకు హామీ
- ఈసారి ఏర్పాట్లు పూర్తికావడంతో యథావిధిగా నిర్వహణ
- సంప్రదాయాల పరిరక్షణకు గ్రామ ప్రజల హర్షం



**ఉప్పల్, ఆగస్టు 1 (జనంసాక్షి ):** ఉప్పల్ గ్రామ బోనాల ఉత్సవాలను గ్రామ సంప్రదాయాలకు అనుగుణంగా ఇకపై ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలోనే నిర్వహించాలన్న గ్రామ ప్రజల ఆకాంక్షకు సానుకూల స్పందన లభించింది. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు శనివారం పోచమ్మ ఆలయ కమిటీకి వినతిపత్రం సమర్పించగా, వచ్చే ఏడాది నుంచి గ్రామస్తుల ఏకాభిప్రాయం మేరకు ఆషాఢ మాసంలోనే బోనాల ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీ అంగీకారం తెలిపింది.

గ్రామస్థుల తరఫున సమర్పించిన వినతిపత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులు మేకల శివారెడ్డి, సల్ల వీరారెడ్డి తదితరులు స్వీకరించి, గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిశీలించారు. గ్రామ సంప్రదాయాలను, ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ఇకపై శ్రావణ మాసానికి బదులుగా ఆషాఢ మాసంలోనే బోనాల ఉత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఈ ఏడాది ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయని, పనివారికి ముందస్తు చెల్లింపులు చేయడంతో పాటు సమయాభావం ఉన్నందున ఈసారి మాత్రం ముందుగా నిర్ణయించిన విధంగానే ఉత్సవాలు నిర్వహించాల్సి వస్తోందని ఆలయ కమిటీ గ్రామస్థులకు వివరించింది. కమిటీ నిర్ణయాన్ని గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు స్వాగతిస్తూ ప్రజల అభిప్రాయాలను గౌరవించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది ఆషాఢ మాసంలో బోనాల ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలంద రూ ఐక్యంగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ నిర్ణయం గ్రామ సంప్రదాయాల పరిరక్షణకు, గ్రామ ఐక్యతకు మరింత బలం చేకూరుస్తుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బీజేపీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి

**జవహర్ నగర్ డివిజన్‌లో బీజేపీ సమీక్షా సమావేశం నిర్వహణ**



**జవహర్ నగర్, ఆగస్టు 1 (జనంసాక్షి ):** జవహర్ నగర్ డివిజన్‌లో చేపట్టిన సర్ కార్యక్రమంపై బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కళికోట కమలాకర్ ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళికోట కమలాకర్ మాట్లాడుతూ, సర్ కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయిలో విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించిన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరికి అవసరమైన సహాయ సహకారాలు అందించి, ఓటరు జాబితా ప్రక్రియను సజావుగా పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డివిజన్ బీజేపీ ఇన్‌చార్జి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు శ్యామ్ సుందర్ శర్మ మాట్లాడుతూ, సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రతి అర్హ ఓటరికి చేరువ కావాలని, పార్టీ శ్రేణులు ప్రణాళికాబద్ధంగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు పోసానిపల్లి మహిపాల్ రెడ్డి, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యురాలు మహేశ్వరి గౌడ్, జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడు మరాఠీ బాబు, సీనియర్ నాయకులు మంద లక్ష్మీనారాయణ, తాటి బలరాం, ప్రధాన కార్యదర్శులు ముచ్చర్ల యాదగిరి, పుల్లూరి అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు మధ్యబోయిన రాజు, కోశాధికారి కోమాకుల రాజు, కార్యదర్శులు ఓరుగంటి లత, మచ్చ అశోక్, మాజీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ పటేల్, ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు రాఘవేంద్ర చారి, నాయకులు భైరవ చారి, మందుల శ్రీధర్, రామ్ లాల్ నాయక్, తులసిరామ్, అలుగోజు సదానందం, మహిళా నాయకురాళ్లు ఇంద్రపాల భవాని, రేసోజు భవాని, అలుగోజు అమూల్యతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్వర్గీయ ఎస్. జానకి పాటలకు స్వర నీరాజనం

**ముషీరాబాద్, ఆగస్టు 01 (జనం సాక్షి):** భారతీయ సినీ సంగీత రంగంలో తన అపూర్వ గానమాధుర్యంతో చిరస్థాయిగా నిలిచిన స్వరమాధురి స్వర్గీయ ఎస్. జానకి స్మృతికి నివాళిగా “స్వర నీరాజనం” కార్యక్రమాన్ని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, ప్రజ్ఞా మెలోడీస్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సోషల్ సర్వీస్ ఉ యాక్టివిస్ట్ గంట శివ కల్యాణి మాట్లాడుతూ, 17 భారతీయ భాషల్లో 45 వేలకుపైగా పాటలు ఆలపించి భారతీయ సంగీత చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహోన్నత గాయని ఎస్. జానకి అని అన్నారు. ప్రతి పాటలో భావం, స్వరశుద్ధి, ఉచ్చారణ, వైవిధ్యాన్ని అద్భుతంగా పలికించిన ఆమె గానప్రస్థానం భావితరాలకు ఆదర్శమని, జానకమ్మ లేని లోటు భారతీయ సంగీత రంగానికి తీరనిదని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జానకమ్మ పాటలకు నివాళిగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులు ఆమె గానశైలిని హృద్యంగా ఆవిష్కరించారని తెలిపారు. ముఖ్యంగా జూనియర్ బాలు విప్లవ్ ఆలపించిన గీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయని, యువతకు జానకమ్మ గానం స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా గాయని గాయకులు రాజేశ్వరి, శ్రీధర్, సింసన్, యాడమ్స్, చిరంజీవి, రాధిక శర్మ, అర్చన, కృష్ణవేణి, పల్లవి, సుగుణ, వెంకటేశ్వర్లు, ట్రాక్ జోగారావు, ప్రముఖ గాయకుడు రింగ్ సైదులు తదితరులు జానకమ్మ ఆలపించిన ఎన్నో మధుర గీతాలను ఆలపించి సంగీత నివాళి అర్పించారు. అనంతరం పాల్గొన్న కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసి, చేనేత కండువాలతో సత్కరించారు. కార్యక్రమం సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకుని జానకమ్మ గాన వైభవాన్ని మరోసారి స్మరింపజేసింది.

## ఘనంగా నిర్వహించిన కూన వెంకటేష్ గౌడ్ 68వ జయంతి వేడుకలు.



**నిజాంపేట్ ఆగస్టు1 జనం సాక్షి :** కుతుబుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో కె వి ఎస్ కన్వెన్షన్ లోశనివారం సీనియర్ నాయకులు కూన వెంకటేష్ గౌడ్ 68 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని కూన వెంకటేష్ గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు వారి కుటుంబ సభ్యులు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని కూన వెంకటేష్ గౌడ్ సేవలను స్మరించుకున్నారు

## రాజకీయాలు వేరు.. ఆత్మీయత వేరు

**పట్నం మహేందర్‌రెడ్డిని పరామర్శించిన పైలెట్ రోహిత్‌రెడ్డి**

**రుక్మమ్మ చిత్రపటానికి నివాళులు**

**తాండూరు, ఆగస్టు 1 (జనంసాక్షి):** రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న మాజీ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి వ్యక్తిగతంగా స్నేహపూర్వక వాతావరణంలో కలుసుకోవడం ఆసక్తికరంగా మారింది. శనివారం కీ.శే. పట్నం రుక్మమ్మ చిత్రపటానికి నివాళులర్పించేందుకు వచ్చిన పైలెట్ రోహిత్‌రెడ్డి, అనంతరం పట్నం మహేందర్‌రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా రుక్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన రోహిత్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. రాజకీయంగా భిన్నపక్షాల్లో ఉన్నప్పటికీ వ్యక్తిగత సంబంధాలను కొనసాగించడం ప్రజాస్వామ్య సంస్కృతికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ భేటీ తాండూరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ప్రపంచ శాంతికి చర్చలే మార్గం

- విజ్ఞాన్‌లో ఘనంగా ప్రారంభమైన రెండో మోడల్ ఐక్యరాజ్యసమితి సదస్సు
- యుద్ధాలు కాదు.. దౌత్యమే సమస్యలకు పరిష్కారం: వి.వి. లక్ష్మీనారాయణ
- రెండు రోజుల సమావేశాల్లో 450 మంది విద్యార్థుల భాగస్వామ్యం
- భావి ప్రపంచ పౌరులుగా బాధ్యతాయుతంగా ఎదగాలని పిలుపు




**నిజాంపేట్, ఆగస్టు 01 (జనం సాక్షి):** విజ్ఞాన్ బోట్రీ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో మోడల్ ఐక్యరాజ్యసమితి (వీఖచీ)-2026 రెండు రోజుల సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాలను ప్రారంభించారు. సెక్రటరీ జనరల్ కుమారి వంశికా శంకర్ అతిథులకు స్వాగతం పలకగా, పాఠశాల ప్రిన్సిపాల్ చలసాని పద్మజ మాట్లాడుతూ విద్య అనేది తరగతి గదికే పరిమితం కాదని, ప్రపంచ అంశాలపై అవగాహన పెంపొందించుకునే వేదికగా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు.

వైస్ చైర్‌పర్సన్ రాణి రుద్రమదేవి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, వాతావరణ మార్పులు అన్ని దేశాలపై ప్రభావం చూపుతున్నాయని, యుద్ధం ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదన్నారు. చర్చలు, దౌత్యం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని, దేశాల మధ్య సమన్వయం పెంపొందించడంలో ఐక్యరాజ్యసమితి కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. భావి ప్రపంచ పౌరులైన విద్యార్థులు అంతర్జాతీయ అంశాలపై అవగాహన పెంపొందించుకుని శాంతి, సహకార భావనతో ముందుకు సాగాలని సూచించారు.

ముఖ్య అతిథి వి.వి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశాల మధ్య అహంకారం, స్వార్థం, ఆధిపత్య ధోరణులే యుద్ధాలకు కారణమవుతున్నాయని అన్నారు. సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించే దిశగా ఐక్యరాజ్యసమితి మరింత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ శాంతి, వసుధైవ కుటుంబక భావనను బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించా లన్నారు. “మేము చిన్నవాళ్లం.. మా వల్ల ఏమవుతుంది” అనే భావనను విద్యార్థులు విడిచిపెట్టాలని, ర్యాన్, మలాలా వంటి యువత ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. ఈ సమావేశాల్లో విద్యార్థులు రూపొందించే తీర్మానాలను వివిధ దేశాల నాయకులకు పంపించి ప్రపంచ శాంతి, అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని సూచించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సందేశాన్ని ప్రస్తావిస్తూ, తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి ఎదగాలని, ఒక రోజు తమ పాఠశాలకు ముఖ్య అతిథులుగా తిరిగి రావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఈ రెండు రోజుల సమావేశాల్లో విజ్ఞాన్‌తో పాటు వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమం ముగింపులో వైస్ ప్రిన్సిపాల్ ఏ.వి.ఎన్. పద్మజ వందన సమర్పణ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అసెంబ్లీని తలపించిన నాగసముందర్ గ్రామసభ

- సమస్యలపై వాడివేడిగా చర్చ.. సర్పంచ్-మాజీ ఎంపీటీసీ మధ్య మాటల యుద్ధం
- అధికారులు, వార్డు సభ్యుల గైర్హాజరుపై గ్రామస్థుల ఆగ్రహం
- 24 గంటల విద్యుత్, ఆసుపత్రి, పీఏసీఎస్ మంజూరుకు డిమాండ్
- సామరస్యంగా స్పందించిన సర్పంచ్.. ప్రజా సమస్యల పరిష్కారానికి హామీ



ధారూర్, ఆగస్టు 1: మండలంలోని నాగసముందర్ గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామసభ అసెంబ్లీని తలపించింది. గ్రామ సర్పంచ్ కోలి వెంకటేశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామాభివృద్ధి, తాగునీరు, విద్యుత్, ఆరోగ్యం, విద్య, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) తదితర అంశాలపై గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు గంటల తరబడి వాడివేడిగా చర్చించారు. సర్పంచ్ కోలి వెంకటేశ్వర్, మాజీ ఎంపీటీసీ గొల్ల బాలప్ప మధ్య పలు అంశాలపై వాగ్వాదం చోటుచేసుకోవడంతో సభలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలో పీఏసీఎస్ భవనం నిర్మించాలని, నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్‌ను వెంటనే మరమ్మతు చేయాలని, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామసభకు అన్ని శాఖల అధికారులు, వార్డు సభ్యులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను సమీకరించడంలో గ్రామపంచాయతీ విఫలమైందని విమర్శిస్తూ, మాజీ ఉపసర్పంచ్‌కు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ కుమార్ సమక్షంలో జీపీవో (బీఎల్ఓ) సయ్యద్ సమీర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సంబంధించిన వివరాలను సభలో చదివి వినిపించారు. మరణించిన ఓటర్లు, డబుల్ ఓట్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారి వివరాలను వెల్లడించి ప్రజల అభ్యంతరాలను స్వీకరించారు.

ఆరోగ్య, విద్య అంశాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగింది. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానేయాలని, నాసిరకం ఉప్పు వినియోగించవద్దని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పాలు అందించాలని, అక్షయపాత్ర భోజనాల నాణ్యత మెరుగుపంచాలని కోరారు. పాడుబడిన పాఠశాల భవనాల తొలగింపు, 14-15 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్, డాక్టర్ జ్యోతి డిప్యుటేషన్ రద్దు, గ్రామంలో 24 గంటల ఆసుపత్రి ఏర్పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవ సేవల పునరుద్ధరణ వంటి అంశాలను గ్రామస్థులు ప్రస్తావించారు. ఆఫా కార్డుల పంపిణీ, వార్డు సభ్యుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్, కాలుష్యానికి కారణమవుతున్న ఫ్యాక్టరీలపై చర్యలు, గ్రామంలో తాడ్‌వైర్ ఏర్పాటు వంటి సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సభలో లేవనెత్తిన ప్రతి సమస్యను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ కోలి వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. గ్రామసభలో ఉపసర్పంచ్ మదారి సంగీత యాదప్ప, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ కుమార్, వార్డు సభ్యులు, జీపీవో సమీర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అశోక్, విశ్వేశ్వర్, డాక్టర్ జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్కు సన్మానం

## తెలంగాణ రాష్ట్ర టూరిస్ట్ అండ్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం


**మొయినాబాద్, ఆగస్టు 01, జనంసాక్షి:** తెలంగాణ రాష్ట్ర టూరిస్ట్ అండ్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం బదిలీపై విధుల్లో చేరిన అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లను కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చొరవతో సరైన పత్రాలు లేకుండా నడుస్తున్న బస్సుల తోపాటు, స్కూల్, కళాశాల బస్సులు ఇతర వాహనాలపై చర్యలు తీసుకున్నారని, శుభకార్యాల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అద్దెకు నడుస్తున్న వాహనాలను నియంత్రించడం వల్ల చట్టబద్ధంగా వ్యాపారం నిర్వహిస్తున్న వాహనాలకు ఊరట లభించిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా రవాణా రంగ అభివృద్ధి, నిబంధనల అమలుకు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి వడ్ల వరకుమార్, ఉపాధ్యక్షులు దిలీప్ కుమార్, కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సత్తిరెడ్డి, సత్యం గౌడ్, వెంకటేష్, సందీప్, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

## జవహర్ నగర్‌లో రెవెన్యూ అధికారుల కూల్చివేతలు



**జవహర్ నగర్, ఆగస్టు 1.(జనంసాక్షి) :** జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని వికలాంగుల కాలనీ, బాలాజీ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే సమాచారంతో రెవెన్యూ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి కూల్చివేత చర్యలు చేపట్టారు.కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపట్టే ఎలాంటి నిర్మాణాలనైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జవహర్ నగర్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజలు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అక్రమ నిర్మాణాలపై భవిష్యత్తులో కూడా నిరంతరం తనిఖీలు, కూల్చివేత చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



# విష సర్పాల విహారం..

- అరణ్యము నుంచి జనావాసాల మధ్యకు.. భయాందోళనలో ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలని ప్రజా ప్రతినిధుల సూచనలు
- పెద్ద ప్రమాదాన్ని తప్పించిన తాండూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రజాక్


**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు1 (జనం సాక్షి ) :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల తలదాచుకోవడానికి దారి లేకపోవడంతో విష సర్పాలు జనవాసాల మధ్యకు వచ్చేసాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంలో తాండూరు పట్టణంలోని ఒక దుకాణంలో విష సర్పాలు వీర విహారం చేశాయి. ఒక విష నాగు పట్టణంలోని ఒక దుకాణంలో చొరబడి అందరిని భయాందోళనకు గురిచేసింది. ఈ విషయం తెలిసిన తాండూరు మున్సిపల్ వైస్ చైర్మన్ రజాక్ చాకచక్యంగా విష నాగును పట్టుకొని ప్లాస్టిక్ కవర్లో బంధించారు. అనంతరం ఆ విష సర్పాన్ని అటవీ ప్రాంతంలో వదిలివేశారు. వికారాబాద్ పట్టణంలోని 31 వ వార్డు శివరాం నగర్ లో విష నాగు ఒక ఇంట్లో విహారం చేసింది. దీనిని చూసిన జనం ఆందోళన గురి అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ మల్లికార్జున్ గౌడ్ వార్డు పరిసర ప్రాంతాల్లో వేపుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను జెసిపి సాయంతో తీసివేశారు. దీంతో కాలనీలో కొంత పరిశుభ్రత నెలకొంది. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా వికారాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అడవి ప్రాంతంలో ఉన్న వరద తాకిడికి రంధ్రాలు మూసుకుపోయాయి. దీంతో తల దాచుకోవడానికి విషసర్పాలకు అనువైన రంధ్రాలు లేని కారణంగా అడవి గుండగా జనావాసాల మధ్యకు వచ్చి అందరిని భయాందోళనకు గురిచేశాయి. అంతేకాకుండా పట్టణాలలో గ్రామాలలో వర్షం కురిసిన కారణంగా పిచ్చి మొక్కలు వేపుగా పెరిగాయి దీంతో విష సర్పాలు జనావాసాల మధ్యకు వచ్చేవరకు గుర్తించని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తగా వెళ్లాలని ఇంటి ముందు ఇంటి చుట్టూ లైట్లు వెలిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని తాండూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రజాక్ వికారాబాద్ పట్టణ 31 వార్డ్ కౌన్సిలర్ మల్లికార్జున గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పెన్‌డౌన్‌తో ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధం లేదు

**కేశంపేట, ఆగస్టు 1 (జనంసాక్షి):** ఉపాధి హామీ పథకంలో కొనసాగుతున్న పెన్‌డౌన్ నిరసనలకు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎలాంటి సంబంధం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టేకుల శ్రీనివాస్ స్పష్టం చేశారు. కేశంపేట మండల కేంద్రంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. వీబీజీ-ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఏపీవోలు, ఈసీలు, టీఏలు, సీఓలు మాత్రమే పెన్‌డౌన్ నిరసన చేపట్టారని, గ్రామస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు బహిష్కరించకుండా యథావిధిగా పనిచేస్తున్నారని తెలిపారు.

# బోనాలకు ప్రభుత్వ చేయూత

- 80 దేవాలయాలకు రూ.27 లక్షల గ్రాంట్ చెక్కుల పంపిణీ
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలి
- దేవాలయ కమిటీలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచన
- శివరాంపల్లిలో గ్రాంట్ చెక్కుల అందజేత కార్యక్రమం



**రాజేంద్రనగర్, ఆగస్టు 1 (జనంసాక్షి):** ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ దేవాలయ కమిటీలకు పిలుపునిచ్చారు. బోనాల పండుగ సందర్భంగా జీహెచ్ఎంసీ పరిధిలోని 80 అమ్మవారి దేవాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.27 లక్షల గ్రాంట్ చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. శివరాంపల్లిలోని రాందేవ్ బాబా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన నిధులను సద్వినియోగం చేసుకుని ఆలయాలను అందంగా అలంకరించడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, హైదర్‌గూడ డివిజన్ అధ్యక్షుడు సామ ఇంద్రపాల్ రెడ్డి, మిద్దెల సురేందర్ రెడ్డి, మిద్దెల సురేష్ రెడ్డి, ప్రేమ్ గౌడ్, వెంకటేష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.